


# కరపత్రం

SINCE 2014

సోమవారం అక్టోబర్ 21 2024 | సంపుటి :0 | సంచిక : 13 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


## హైదరాబాద్ నుంచి యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ సేవలు త్వరలో



ఈ పనులను 2025 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామన్నారు.

దక్షిణ భారతదేశంలోనే అత్యంత ఆధునిక సౌకర్యాలతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను ప్రధాని నరేంద్రమోదీ ప్రజలకు అంకితం చేస్తారని కేంద్రమంత్రి తెలిపారు.

రూ.430 కోట్లతో కొనసాగుతున్న చర్లపల్లి టెర్మినల్ నిర్మాణ పనులను కిషన్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.అమృత్ పథకంలో భాగంగా స్థానికంగా ఉన్న అన్ని రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. రూ.430 కోట్లతో చర్లపల్లి, రూ.715 కోట్లతో సికింద్రాబాద్, రూ.429 కోట్లతో నాంపల్లి రైల్వేస్టేషన్‌లలో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. రూ.521 కోట్లతో కాజీపేటలో రైల్ మానిఫ్యాక్చరింగ్ యూనిట్ పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయన్నారు.


# త్యాగాలు చేయకుండా గొప్ప నాయకులం

**జీవితంలో రిస్క్ లేకుండా గొప్ప విజయాలు సాధించలేమని.. త్యాగాలు చేయకుండా గొప్ప నాయకులం కాలేమని**

- జీవితంలో రిస్క్ లేకుండా గొప్ప విజయాలు సాధించలేమని..
- త్యాగాలు చేయకుండా గొప్ప నాయకులం కాలేమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.
- మంచి లీడర్ కావాలంటే ధైర్యం, త్యాగం ఉండాలని చెప్పారు.
- ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో నిర్వహించిన లీడర్‌షిప్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడారు.
- "మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, మన్మోహన్‌సింగ్, పీవీ నరసింహారావు సహా ఎంతోమంది నాయకులు మనందరికీ ఆదర్శం.

నాయకత్వ లక్షణాలను వారి నుంచే నేర్చుకున్నాను. నాయకులు డబ్బు సమయం, వ్యక్తిగత జీవితం. ఇలా అన్నీ త్యాగం చేయాలి. మంచి లీడర్ కావాంటే ధైర్యం, త్యాగం ఉండాలి. సిగ్గుపడకుండా ప్రజలతో మమేకమవ్వాలి. ఐఎస్‌బీలో ఉన్న వారంతా తెలంగాణ, దేశానికి అంబాసిడర్లు. హైదరాబాద్‌ను 600 మిలియన్ సిటీగా మార్చేందుకు మీ అందరి సహకారం కావాలి. తెలంగాణను ఇతర రాష్ట్రాలతో పోల్చను. న్యూయార్క్ లండన్, పారిస్‌తో పోల్చాలనుకుంటాను. మీరంతా తెలంగాణలో 2, 3 ఏళ్లు పనిచేయాలి. మా ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల తరహాలో మంచి జీతాలు ఇవ్వలేకపోవచ్చు కానీ.. మంచి సవాళ్లు జీవితానికి సరిపడా నాలెడ్జ్ అందిస్తుంది. దురదృష్టవశాత్తు ఒలింపిక్స్‌లో భారత్ స్వర్ణపతకాలు గెలవలేకపోయింది. అక్కడ అత్యధిక పతకాలు గెలవడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. వ్యాపారాల్లో రాణిస్తున్న వారు ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు రావాలి"అని రేవంత్ పిలుపునిచ్చారు.

ఈ సమ్మిట్‌కు ముఖ్యమంత్రి రేవంత్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి అద్భుతమైన వారసత్వం ఉంది.



## ఒక్కొక్కరికి ఒక్కోలా హెచ్‌ఎండీఏ నిబంధనలు

అధికారులు 'ఏవో ఒత్తిళ్ల'తో పని చేస్తున్నట్లుంది

హాజరై వివరణివ్వాలని కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం

నిర్మాణాలకు అనుమతుల మంజూరు వ్యవహారంలో హెచ్‌ఎండీఏ తీరును హైకోర్టు తప్పుబట్టింది. దరఖాస్తును పరిశీలించి అనుమతులు మంజూరు చేయాలంటూ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయకపోవడంపై అక్షయ డెవలపర్స్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది.



ఒక్కొక్కరికి ఒక నిబంధన అన్నట్లుగా ఉందని వ్యాఖ్యానించింది. దరఖాస్తును పరిశీలించి అనుమతులు మంజూరు చేయాలంటూ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయకపోవడంపై అక్షయ డెవలపర్స్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది.పిటిషనర్ తరఫు న్యాయవాది ఎస్.శ్రీధర్ వాదనలు వినిపిస్తూ.. "సర్వీసు రోడ్డు లేదన్న కారణంగా అక్షయ డెవలపర్స్‌కు హెచ్‌ఎండీఏ అనుమతులు తిరస్కరించింది. ఇదే ప్రాంతంలో గణపతి సచ్చిదానంద అవధూత పీఠం ట్రస్టుకు అనుమతులు మంజూరు చేసి పిటిషనర్ విషయంలో నిరాకరించింది. ఈ వ్యవహారాన్ని విచారించిన హైకోర్టు హెచ్‌ఎండీఏ అప్పీలును కొట్టివేసింది.

## ఏఐ అంటే రేవంత్ రెడ్డి ఎనుముల ఇంటెలిజెన్స్ : కేటీఆర్



- తెలంగాణలో 40 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసినట్లు జాతీయ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో చేసిన పోస్టుపై భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు
- రుణమాఫీ చేసినట్లు ఇచ్చిన ప్రకటనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రూపొందించిన చిత్రాన్ని వాడారని..
- రైతుల లెక్క విషయంలోనూ సీఎం అదే టెక్నిక్ వాడారంటూ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ పేర్కొన్న 40 లక్షలు అనే సంఖ్యను సీఎం రేవంత్ రెడ్డి (ఏఐ) అంటే (ఎనుముల ఇంటెలిజెన్స్)తో రూపొందించిందేనని ఎద్దేవా చేశారు.

నిజానికి తెలంగాణలో ఇప్పటి వరకు రైతు రుణాలు 40 శాతం కూడా మాఫీ కాలేదని చెప్పారు. కానీ తరుచూ నిబంధనలతోపాటు రుణమాఫీ తేదీలను మారుస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి తన సొంత గ్రామం, నియోజకవర్గంలోనూ రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చడంలో విఫలమయ్యారని విమర్శించారు.

## అశోక్ నగర్‌లో గ్రూప్-1 అభ్యర్థుల ఆందోళన..

**భారీగా మోహరించిన పోలీసులు**



అశోక్‌నగర్ చౌరస్తాలో గ్రూప్-1 అభ్యర్థులు ఆందోళన చేస్తున్నారు. దీంతో పోలీసులు భారీగా మోహరించారు. ప్రభుత్వం పేదలు, బడుగు బలహీన వర్గాల గొంతు కోస్తోందని పలువురు అభ్యర్థులు ఆరోపించారు. మానసికంగా ఒత్తిడి ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. జీవో 29 వల్ల.. రిజర్వేషన్ పొందేవారు ఓపెన్ కేటగిరీలో ఉద్యోగం పొందే అర్హత లేదని పేర్కొన్నారు. హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకున్నంత మాత్రాన తాము పరీక్ష రాసేందుకు సిద్ధంగా ఉన్నట్టు కాదని స్పష్టం చేశారు. సీఎం తమను పిలిపించుకొని బాధ వినాలని కోరారు.

## రేవంత్‌రెడ్డి మోసాలను ప్రజలు గ్రహిస్తున్నారు: హరీశ్‌రావు

**- కేసీఆర్ పాలనలో సరైన సమయంలోనే రైతుబంధు పంపిణీ చేశారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు**



కేసీఆర్ పాలనలో సరైన సమయంలోనే రైతుబంధు పంపిణీ చేశారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. కరీంనగర్‌లోని కొత్తపల్లిలో భారాస ఆధ్వర్యంలో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వర్షాలు వచ్చేలోపే రైతుబంధు ఇవ్వాలని గతంలో కేసీఆర్ చెప్పారని గుర్తుచేశారు."కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక రైతుబంధు రావడం లేదు.. చేప పిల్లల పంపిణీ జరగడం లేదు. రైతుభరోసా కోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేయాలి. రేవంత్‌రెడ్డి మోసాలను ప్రజలు గ్రహిస్తున్నారు.



## 2028లోపు నేను సీఎం అవుతా: హెచ్.డి.కుమారస్వామి

2028 లోపు తాను మళ్లీ కర్ణాటక ముఖ్యమంత్రి అవుతానని కేంద్ర మంత్రి హెచ్.డి.కుమారస్వామి అన్నారు.దేవెగౌడ కుమారుడు, కేంద్ర మంత్రి హెచ్.డి.కుమారస్వామికీలక వ్యాఖ్యలు చేశారు. 2028 లోపు తాను మళ్లీ కర్ణాటక ముఖ్యమంత్రి అవుతానని పేర్కొన్నారు. ప్రస్తుతం కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో నెలకొంటున్న అంతర్గత కలహాల కారణంగా ఈ ప్రభుత్వం పతనమవుతుందని జోస్యం చెప్పారు.ప్రజలు కోరుకుంటే తాను ముఖ్యమంత్రిని అవుతానని.. వారు తనకు మరో అవకాశం ఇస్తారని నమ్ముతున్నానని కుమారస్వామి అన్నారు. 2028లోపు వారి మద్దతుతో సీఎంగా బాధ్యతలు చేపట్టి, మరింత అద్భుతంగా పని చేస్తానని పేర్కొన్నారు.

# సంపాదకీయం

## తొలి అడుగు..!



పాకిస్థాన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సుకు భారత విదేశాంగ మంత్రి జైశంకర్ హాజరుకావడం ఒక విశేషమైన పరిణామం. దాదాపు పదేళ్ళ తరువాత భారతవిదేశాంగమంత్రి పాకిస్థాన్‌లో కాలూనిన సందర్భం ఇది. షాంఘై సహకార సంస్థ సదస్సుకు పాకిస్థాన్ అతిథ్యం ఇస్తున్నది కనుక, ఈ విస్తృత వేదికలో భాగస్వామిగా, ఆ సదస్సులో పాలుపంచుకోవడానికి మాత్రమే ఆయన వెడుతున్నారు తప్ప పాకిస్థాన్‌తో రాసుకుపూసుకొనేదేమీ ఉండదని ప్రయాణానికి ఎంతో ముందుగానే జైశంకర్ పక్షాన ఆయన మంత్రిత్వశాఖ ఓ మాట చెప్పింది కూడా. ఆయన ప్రయాణం, పెద్దలతో భేటీలు ద్వైపాక్షికవ్యవహారం కాకపోవచ్చును కానీ, ఉభయదేశాల మధ్యా గడ్డకట్టుకొనిపోయిన దౌత్యసంబంధాల్లో కాస్తంత సానుకూలమైన మార్పు తీసుకురావడానికి ఆయన పర్యటన పరోక్షంగా ఉపకరించవచ్చు. సదస్సు సందర్భంగా పాకిస్థాన్‌తో విడిగా ఎటువంటి మంతనాలు, చర్చలూ ఉండవని మనం తేల్చేయడమూ, అటు పాకిస్థాన్ కూడా అదే తరహాలో ద్వైపాక్షిక చర్చలు ఉండవంటూ స్పందించడం ఒక విధంగా వాతావరణాన్ని సానుకూలం చేసింది. అన్ని అనుమానాలు, శషబిషలు పక్కనబెట్టి చక్కగా పలకరించుకొని, చేయిచేయీ కలుపుకొని, కాస్తంత నవ్వుకోవడానికి ఈ పరిస్థితి అవకాశం ఇచ్చింది.వాతావరణం బాగా ఉద్రిక్తంగా ఉన్న నేపథ్యంలో, వేరొక అవసరం చేత పొరుగుదేశానికి ప్రయాణం కట్టవలసివచ్చినా కూడా దానినుంచి మిగతావారు ఊ?హించేదీ ఎక్కువే ఉంటుంది. అందువల్ల, ఈ పర్యటనకు ఏ విలువా లేదని ఉభయులూ ముందుగానే తేల్చేస్తే ఆ మేరకు ఆశతో పాటు, ప్రమాదం కూడా తగ్గుతుంది. దౌత్యసంబంధాలను కాస్తంత చక్కదిద్దుకోడానికి కొంతకాలంగా తెరవెనుక ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రచారం ఉన్న నేపథ్యంలో ఇది మరీ అవసరం. అంతవరకూ సంబంధాలు అద్భుతంగా ఉన్నాయని కాదు కానీ, జమ్మూకశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి రద్దు నిర్ణయం రెండు దేశాల మధ్యా అతిపెద్ద అగాధాన్ని సృష్టించింది. ఢిల్లీలో తన హైకమిషనర్‌ను ఉపసంహరించుకొని, తనదేశంనుంచి మనవారిని వెళ్ళగొట్టి, వాణిజ్యసంబంధాలను సైతం తెగదెంపులు చేసుకొని చాలా హడావుడి చేసింది. జమ్మూకశ్మీర్‌కు తిరిగి ఆ అధికారాలన్నీ దక్కితేనే తననుంచి ఓ మాట, ఓ పలకరింపు ఆశించాలని స్పష్టంచేసింది. మనకు మరింత దూరంగా పోయి, ద్వైపాక్షిక చర్చలను కాదనుకున్నది ఆ దేశమే. ఈ పరిస్థితుల మధ్య, వెళ్ళిన పనేదో చూసుకొని రావడం తప్ప, జయశంకర్ పర్యటనలో ఏవో విశేషాలు, అనూహ్యమైన మలుపులూ ఉంటాయని ఎవరూ ఆశించలేదు. తన ప్రసంగంలో ఉగ్రవాదం గురించి, దానిని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ తదితర దేశాల గురించి తాను చెప్పదల్చుకున్నదేదో జైశంకర్ కూడా కుండబద్దలు కొట్టేశారు. పొరుగుదేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను గుర్తించి గౌరవించుకోవడం నేర్చుకోమంటూ చైనా, పాకిస్థాన్‌కు గట్టిగానే చీవాట్లు వేశారు. ఉభయదేశాల మధ్యా దూరాన్ని పెంచుతున్న ఉగ్రవాదంతో నిజాయితీగా పోరాడాలంటూ పాకిస్థాన్‌కు హితవు చెప్పారు. చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బీఆర్ఐ) మరింత విస్తరించాలనీ, హైవేలు, ఓడరేవులు, రైల్వేలైన్లతో ఆసియా నుంచి ఆఫ్రికావరకూ అంతా కళకళలాడిపోవాలని పాకిస్థాన్ ప్రధాని చైనాను ఆకాశానికి ఎత్తేస్తే, దానికి పూర్తి భిన్నమైన, విరుగుడు వ్యాఖ్యలు జైశంకర్ చేశారు. ఆర్థికం, వాణిజ్యం, పర్యావరణం తదితర అంశాలపట్ల ఆయా ప్రభుత్వాల అధికారిక వైఖరులు ఎలా ఉన్నప్పటికీ, ఈ సందర్భంగా పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించకపోవడం గమనార్హం. ఇటీవల ప్రతీసందర్భంలోనూ, అన్ని అంతర్జాతీయవేదికలమీదా ఆయన కశ్మీర్ ఊసులేకుండా ప్రసంగాలు చేయలేదు. అలాగే, విందు సందర్భంలో ఆయన జైశంకర్‌తో కాస్త ఎడంగా కొద్దిసేపు ముచ్చటించడం, పాకిస్థాన్ ఉప ప్రధాని, విదేశాంగమంత్రులు కూడా సుదీర్ఘసమయం మాట్లాడటం వంటివి జరిగాయి. మరోవైపు, ఎస్సీవో సదస్సుకోసం పాకిస్థాన్ వెళ్ళిన భారతదేశ పాత్రికేయులతో పాకిస్థాన్ మాజీ ప్రధాని నవాజ్‌షరీఫ్, ఆయన కుమార్తె మరియం నవాజ్ ప్రత్యేకంగా భేటీ కావడం, జైశంకర్ పర్యటనను తొలి అడుగుగా అభివర్ణించడం విశేషం. భారతజర్నలిస్టులతో వారిరువురూ భేటీ కావడంపై పాకిస్థాన్ మీడియా సంస్థలు భిన్నంగా స్పందించాయి

# కమలా హారిస్ 60వ పుట్టినరోజు.. రెస్టరంట్లో పనిచేస్తానన్న ట్రంప్!



రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌పై తనదైన శైలితో విరుచుకుపడుతున్న డెమోక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్.. ట్రంప్ (78) వయసును అస్త్రంగా మలచుకొంటూ ఆయన్ను ఇరకాటంలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికలకు సమయం సమీపిస్తున్న వేళ విస్తృత ప్రచారంతో అభ్యర్థులు తలమునకలై ఉన్నారు. డెమోక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ .. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ (78) వయసును అస్త్రంగా మలచుకొంటూ ఆయన్ను ఇరకాటంలో పెట్టేందుకు యత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే అక్టోబర్ 20న కమలా హారిస్ 60వ పుట్టినరోజు చేసుకుంటుండగా.. ట్రంప్ మాత్రం తనదైన శైలిలో ఆమెపై విమర్శలు గుప్పించేందుకు సిద్ధమయ్యారు.నవంబర్ 5న జరగనున్న అధ్యక్ష ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే కీలక రాష్ట్రాల్లో ఇరునేతలు పర్యటిస్తున్నారు. ప్రత్యర్థుల బలహీనతలను ఎత్తిచూపుతూ ఓటర్ల మద్దతును కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో తన పుట్టినరోజైన ఆదివారం జార్జియాలోని పలు చర్చిలను కమలా హారిస్ సందర్శించనున్నారు. డొనాల్డ్ ట్రంప్ మాత్రం పెన్సిల్వేనియాలోని మెక్‌డొనాల్డ్ ఫుడ్ కోర్టులో కొంతసేపు పనిచేయనున్నట్లు తెలిపారు. యుక్తవయసులో ఉన్నప్పుడు ఓ మెక్‌డొనాల్డ్‌లో పనిచేశానని కమలా హారిస్ గతంలో వెల్లడించారు. ఇదే విషయాన్ని గుర్తు చేస్తున్న ట్రంప్.. ఆమె మాటలను తాను విశ్వసించనని అన్నారు. ఈ నేపథ్యంలోనే కమలా హారిస్ పుట్టిన రోజు రెస్టరంట్లో పనిచేస్తానని చెప్పారు. కేవలం కమలా హారిస్‌పై తనదైన శైలిలో విమర్శలు గుప్పించేందుకు అక్కడ కాసేపు సరదాగా పనిచేస్తానని ఓ ఇంటర్వ్యూలో ట్రంప్ వెల్లడించడం గమనార్హం. ఇదిలాఉంటే, దేశాధ్యక్షురాలిగా పనిచేసేందుకు కమలా హారిస్ శారీరకంగా, మానసికంగా దృఢంగా (ఫిట్‌గా) ఉన్నారని ఆమె వ్యక్తిగత వైద్యుడు జాషువా సిమన్స్ ఇటీవల వెల్లడించారు. ఈ మేరకు హారిస్ వైద్య చరిత్ర, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితికి సంబంధించి వివరాలను విడుదల చేశారు. మరోవైపు, ట్రంప్ మాత్రం కొన్నేళ్లుగా తన ఆరోగ్యానికి సంబంధించి పరిమితంగానే సమాచారం విడుదల చేస్తూ వస్తున్నారు. జులైలో తనపై హత్యాయత్నం జరిగిన తర్వాత కూడా చాలా తక్కువ సమాచారమే ఇచ్చారు.

# భారత మీడియాపై కెనడా పోలీసుల అక్కసు..



కెనడా పోలీసులు భారత్ మీడియాపై అక్కసు వెళ్లగక్కారు. తప్పుగా రిపోర్టింగ్ చేస్తోందని పేర్కొన్నారు. భారత క్రిమినల్ గ్యాంగ్‌ల నుంచి కెనడా వాసులకు ఇప్పటికిప్పుడు ఎలాంటి ముప్పులేదని రాయల్ కెనేడియన్ మౌంటెడ్ పోలీస్ అధికారిణి బ్రిగెట్టే గౌవిన్ ఓ ఇంటర్వ్యూలో అన్నారు. ఆ దేశానికి చెందిన సీబీసీ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆదివారం ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలోని హింసలో భారత ప్రభుత్వ హస్తం ఉందంటూ ఆర్సీఎంపీ కొన్నాళ్ల క్రితమే ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బ్రిగెట్టే వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కొన్ని సార్లు పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని.. దీనిలో భాగంగానే గతంలో ఆ వ్యాఖ్యలు చేసినట్లు వివరణ ఇచ్చారు."మేము చాలా ముందు జాగ్రత్త చర్యలు తీసుకొన్నాం. కొన్ని ఆధారాలను భారత్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు చూపించాలనుకున్నాం. కానీ, అవి విఫలమయ్యాయి. భారత మీడియా తప్పుగా రిపోర్ట్ చేస్తోంది. మేము వాటిని సరిచేయాలనుకుంటున్నాం" అని బ్రిగెట్టే పేర్కొన్నారు. భారత క్రిమినల్ గ్యాంగుల నెట్‌వర్క్ అసాధారణంగా ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. గత సోమవారం తాము చేసిన ప్రకటన అర్థం.. ఇప్పటికిప్పుడు ముప్పుందని కాదని, ముందు జాగ్రత్త కోసం వెల్లడించాల్సి వచ్చిందన్నారు. తాజాగా ఆర్సీఎంపీ అధికారి వ్యాఖ్యలు భారత్-కెనడా సంబంధలను మరింత దిగజార్చాయి. నిజ్జర్‌ను గత ఏడాది హతమార్చడంలో భారత ప్రభుత్వ ఏజెంట్ల పాత్ర ఉందని ఆరోపణలు చేసినప్పుడు తనవద్ద నిఘా సమాచారమే తప్పిస్తే పక్కా ఆధారాలేవీ లేవని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో బుధవారం అంగీకరించారు. కెనడా ఎన్నికల ప్రక్రియ, ప్రజాస్వామ్య వ్యవస్థల్లో విదేశాల జోక్యంపై విచారణ నిర్వహిస్తున్న కమిటీ ముందు ఆయన ఈ విషయాన్ని ధ్రువపర్చారు. మరోవైపు కెనడా ఆర్సీఎంపీ అధికారిణేమో ఆధారాలున్నాయంటూ వెల్లడించడం గమనార్హం. దీనికి తోడు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌పై కెనడా ఆరోపణలు చేస్తోంది. మరో వైపు అదే గ్యాంగ్‌కు చెందిన కీలక వ్యక్తి గోల్డీబ్రార్‌కు ఆశ్రయం ఇచ్చింది. అనుమోల్ బిష్ణోయ్ కూడా ఆ దేశంలోనే ఉన్నట్లు భావిస్తున్నారు.

# ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాల హామీ ఏమైంది?:మహేశ్‌కుమార్ గౌడ్



ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న ప్రధాని మోదీ హామీ ఏమైందో భాజపా నేతలు చెప్పాలని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. గత పదేళ్లలో భాజపా ప్రభుత్వం ఎన్ని కోట్ల ఉద్యోగాలు ఇచ్చిందో చెప్పాలన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ఎంతమంది ఉద్యోగాలు ఊడగొట్టిందో తమ వద్ద లెక్క ఉందన్నారు. "ప్రధాని మోదీ ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేసి లక్షల మంది ఉద్యోగాలు పోగొట్టారు. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం ఒక్కసారి కూడా గ్రూప్-1 నోటిఫికేషన్ ఇవ్వలేదు. కనీసం 70 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. ఇంటర్ ఫలితాలను తప్పుల తడకగా ఇచ్చి వందలాది మంది విద్యార్థుల చావులకు కారణమైంది. కానీ, 10 నెలలు కూడా పూర్తి కాని కాంగ్రెస్ ప్రభుత్వం 50 వేలకుపైగా ఉద్యోగాలు భర్తీ చేసింది. పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలను జిరాక్స్ సెంటర్లలో భారాస ప్రభుత్వం అమ్మకానికి పెట్టింది. ప్రస్తుతం చర్చనీయాంశమైన జీవో 29ను ఫిబ్రవరి నెలలో ఇచ్చారు. విపక్షాలు ఇంతకాలం ఎందుకు మాట్లాడలేదు అభ్యర్థులను తప్పుదోవ పట్టించి రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. పరీక్షలు తరచూ వాయిదా పడితే అభ్యర్థులకు మంచిది కాదు. 563 పోస్టులతో గ్రూప్-1 నోటిఫికేషన్ ఫిబ్రవరిలో విడుదలైంది. నిరుద్యోగులను ఇబ్బంది పెట్టొద్దని పోలీసులను కోరుతున్నాం. రాజకీయ నేతల కుట్రపూరిత ఉచ్చులో విద్యార్థులు పడొద్దు. ఎవరిపైనా లాఠీఛార్జ్ చేయొద్దని పోలీసులకు విజ్ఞప్తి చేస్తున్నా" అని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు.

# బుద్ధుని మార్గంతోనే సుఖమయం జీవనం ...

కొమరం భీం జిల్లా ఆసిఫాబాద్ ప్రతినిధి రోడ్డ శంకర్ వాంకిడి



బుద్ధుని మార్గంతోనే ప్రతి ఒక్కరి జీవనంలో సుఖమయ జీవితం దొరుకుతుందని, వర్శవాస్ కార్యక్రమాలతో అంబేద్కర్ మార్గంలో ప్రశ్నించే తత్వం లభిస్తుందని భారతీయ బౌద్ధ మహా సభ జిల్లా అధ్యక్షులు మహా ప్రబ్ అశోక్ మహుల్కార్ అన్నారు.ఖమన గ్రామంలో ఆదివారం నిర్వహించిన 10వ వర్సవాస్ ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అంబేద్కర్ జీవిత చరిత్రను అశాడ పౌర్ణిమ నుండి అశ్విని పౌర్ణిమ వరకు 3 నెలల పాటు జరిగిన గ్రంథ పఠనం కార్యక్రమం కొనసాగిందని అన్నారు.ఇలా జిల్లా మొత్తంలో బుద్ధుడు,అంబేద్కర్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని బుద్ధుని కార్యక్రమాలు జరగడం శాంతి మార్గాన్ని నిదర్శనమని అన్నారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొని భారతీయ బౌద్ధ మహా సభ జిల్లా నాయకులు శ్యామ్ రావు దుర్గం,ఉపా అధ్యక్షులు,.తుకారాం , వినీష్ ఉప్రే, కోశాధికారి తిరుపతి దుర్గం,వాంకిడి అంబేద్కర్ సంఘం నాయకులు,విజయ్ ఉప్రే,విలాస్ కొబ్రగడె,సందీప్ దుర్గం,సంతోష్ జాడే,బౌద్ధ ఉపాసక్ కిషన్ కొబ్రాగడే,,లు వర్శశాస్ కార్యక్రమం పై మాట్లాడారు.అనంతరం బుద్ధుని కీర్తనలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు,మహిళలు పాల్గొన్నారు.

## కొత్తపెల్లి ప్రాథమిక వ్యవసాయ కేంద్రం మల్లారెడ్డిపేట లో వడ్లు కొనుగోలు కేంద్రం ప్రారంభం,

గంభీరావుపేట అక్టోబర్ 20 ప్రతినిధి

గంభీరావుపేట మండల మల్లారెడ్డిపేటలో కొత్తపెల్లి ప్రాథమిక వ్యవసాయ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొమిరిశెట్టి విజయ తిరుపతి, వైస్ చైర్మన్ పాతూరు అంజిరెడ్డి పార్టీ మండల అధ్యక్షులు యండి హమీద్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొలుగోలు కేంద్రాన్ని మల్లారెడ్డిపేటలో ప్రారంభించడం జరిగింది , ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన సన్న వడ్లు కు 500 రూపాయలు బోనస్ తొ పాట పంటకు సరైన మద్దతు కలిపిస్తూ ఈ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్ణయం తీసుకున్నారు తూకం విషయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకొవడం జరుగుతుంది గత పాలకులు రైతులను తూకం విషయంలో అనేక మొసాలు దోపిడీలు చేసి సొమ్ము చేసుకున్న సంగతి మనందరికీ తెలుసు, ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రైతుల పక్షపాతిగా మునుపటిలాగా రైతులకు దళారీ బెడద ఉండదని పండించిన పంట ఒక్క గింజ కూడా పక్కా దారిలో పడకుండా అవినీతి జరగకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు కొనుగోలు సెంటర్లో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ప్రభుత్వ అధికారులతో సమీక్షిస్తూ ప్రజాపాలన సాగుతుందని భరోసా కల్పించారు వడ్లు కొనుగోలు కేంద్రాల్లో ఎవరైనా అవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు, రైతులు దళారుల మాటలకు మోసపోవద్దని పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలోనే విక్రయించు కోవాలని రైతులకు ఈ సందర్భంగా విన్నవించారు,ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కొమిరిశెట్టి తిరుపతి ,కేడీసీసీ వైస్ చైర్మన్ గాండ్ల రాజం, కొత్తపెల్లి సెక్రటరీ రాజయ్య గ్రామ శాఖ అధ్యక్షులు సతీష్ రెడ్డి మండల ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి సోషల్ మీడియా కన్వీనర్ (గౌరీ) శంకర్, రమేష్ రెడ్డి రాజు గ్రామ శాఖ ఎస్సీ సెల్ ఆంజనేయులు, డైరెక్టర్లు బాల్ రెడ్డి లక్ష్మణరావు రాజం ప్రభాకర్ లింగం రాజనర్సు, అజాం విట్టల్ గంగరాజు గౌడ్ సత్తయ్య కృష్ణమూర్తి రాజారాం రెడ్డి బంగ్లా రాజు రాజశేఖర్ కొక్కురాజ్యం లచ్చయ్య లు మరియు పార్టీ శ్రేణులు రైతులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

కరపత్రం తెలుగు దిన పత్రిక
సోమవారం అక్టోబర్ 21 2024

## ఏనుగు చచ్చినా,మనిషి చచ్చినా ఒకే విలువ!

సైన్స్ డెస్క్ కరపత్రం
ఏనుగు బతికినా చచ్చినా ఒకే విలువ అని సామెత ఉంది.
ఆ సామెత ఇప్పుడు మనిషికి కూడా వర్తించబోతున్నది.



మనిషి బ్రతికున్నప్పుడే విలువ అనుకుంటాం కానీ.. చనిపోయాక కూడా మనిషి బూడిదకు అంతకు మించి విలువ ఉంది. ఎలానో తెలుసా? మనిషి బూడిదలో డెంటల్ ఫిల్లింగ్స్, బోన్ ఇంప్లాంట్స్‌కు వాడే పల్లాడియం, టైటానియం వంటి విలువైన లోహాలు ఉంటాయని జపాన్ ప్రభుత్వం గుర్తించింది.దీంతో అక్కడ చనిపోయిన 15 లక్షల మంది చితాభస్మం నుంచి లోహాలను సేకరించి విక్రయించడం ద్వారా దాదాపు రూ. 400 కోట్లను ఆర్జించింది.ఈ డబ్బులతో అక్కడి స్మశాన వాటికలను అభివృద్ధి చేస్తోంది.ఈ పరిణామం,ఈ వార్త వినడానికి బాగానే ఉంది.కాని భారతీయ సమాజం ఇటువంటి పరిణామాలను ఆహ్వానిస్తుందా అనేది ప్రశ్న.ఇకాలంలో ఎన్నో మార్పులు వస్తూ ఉంటాయి.కొన్ని మార్పులను ఇముడ్చుకుంటూ కొన్ని విసర్జిస్తూ సమాజం సాగుతూనే ఉంటుంది.
ఏమో గుర్రం ఎగరావచ్చు..

## జీవో నెం.29 పై పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు



కరపత్రం బ్యూరో హైద్రాబాద్
తెలంగాణలో ఇప్పుడు గ్రూపు-1 మెయిన్స్ పరీక్షలు హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. గ్రూపు-1 పరీక్షలు జరుగుతాయా..? లేదా అని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. జీవో నెం.29 పై విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని.. ఈ జీవోతో రిజర్వేషన్ కేటగిరి అభ్యర్థులకు ఎలాంటి నష్టం జరగదని స్పష్టం చేశారు. ఎందరో నిపుణులతో చర్చించిన తరువాతనే జీవో నెం.29ని తీసుకొచ్చామని తెలిపారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం..




-ఆది శ్రీనివాస్
కరపత్రం ప్రతినిధి సిరిసిల్ల
ఇక్రీడలతో మానసిక ఉల్లాసం ఏర్పడుతుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణంలో కాలేజ్ గ్రౌండ్ లో రాజన్న సిరిసిల్ల ప్రీమియం సీజన్ 2 కాంగ్రెస్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే శ్రీ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. క్రీడా పోటీల నిర్వహణ వల్ల మానసిక ఉల్లాసంతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలతో స్నేహభావం పెరగడానికి ఉపయోగపడుతుందన్నారు.

## నేడు ఎస్టీ కమీషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ పర్యటన

కరపత్రం (పాలకుర్తి ప్రతినిధి):



పాలకుర్తి మండలం కొండాపురం మేకలతండాకు చెందిన లకావత్ శ్రీను ఆత్మహత్యకు కారణమైన పరిస్థితులు సమీక్షించేందుకు , వారి కుటుంబ సభ్యులను పరామర్శించెందుకు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ నేడు పాలకుర్తిలో పర్యటిస్తున్నారు. వారితో బిజెపి జనగామ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఆరుట్ల దశమంత్ రెడ్డి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లేగ రామ్మోహన్ రెడ్డి పాల్గొంటారు కావున గిరిజన నాయకులు బిజెపి ముఖ్య ప్రతినిధులు పాల్గొనవలిసిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

# రైతు భరోసా కాదు రైతు నిరాశ ప్రభుత్వమిది



కరుణాకర్ మల్లిగారి కరపత్రం ప్రతినిధి మేడ్చల్ నియోజక వర్గం
ఈ వర్షాకాలం రైతులకు ఇవ్వాల్సిన రైతు భరోసా ను ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక పాలనకు నిరసనగా బీ ఆర్ ఎస్ పార్టీ తెలంగాణ వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలకు పిలుపునిచ్చింది.ఈ కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు నిన్న ఆదివారం రోజు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో అన్ని గ్రామాల పార్టీ నాయకులు,మండల నాయకులు పాల్గొన్నారు.బి ఆర్ ఎస్ నాయకుడు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్, మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు దయానంద్ యాదవ్ ఇట్టి కార్యక్రమంలో మాట్లాడారు.బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులకు సకాలంలో రైతుబంధు పథకం ద్వారా పంట పెట్టుబడు సాయం అందించింది. కానీ కాంగ్రెస్ గవర్నమెంట్ పంటకు 7500 ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చింది. వచ్చిన తర్వాత రైతులను మోసం చేసింది.ఇది రైతు నిరాశ ప్రభుత్వం అని శ్రీ భాస్కర్ యాదవ్ అన్నారు.వానాకాలం రైతు భరోసా నిలిపివేయడం మోసం అని, కాంగ్రెస్ గవర్నమెంట్ రైతులను పీడిస్తుంది కాబట్టి మళ్లీ పుట్టగతులు ఉండవని వారు తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి హాజరైన బిఆర్ఎస్ నాయకులు,రాజమల్లారెడ్డి గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి,డబిల్ పూర్ సహకార సంఘం చైర్మన్ సురేష్ రెడ్డి రెడ్డి, సర్పంచులు చిన్నోల్ల కవిత జీవన్, బైరి లక్ష్మి సంజీవయ్య, కోనాయి పల్లి మాజీ సర్పంచ్ గుంటి శేఖర్, చిట్టిమల్ల గణేష్, కరుణాకర్, బి ఆర్ ఎస్ నాయకులు యూనిస్ పాషా, కౌన్సిలర్లు తుడుం గణేష్ సందీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ అంతరిక్ష క్విజ్ పోటీ విజేతల్లో కోదాడ తేజ విద్యాలయ విద్యార్థి హర్షవర్ధనరెడ్డి

- దేశవ్యాప్తంగా 100 మంది విద్యార్థుల ఎంపిక
- విజేతలకు ఇస్రో సందర్శనకు అవకాశం


విద్యార్థి హర్షవర్ధన్ రెడ్డిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీమతి రమా సోమిరెడ్డి

కరపత్రం ప్రతినిధి కోదాడ :
జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జాతీయ క్విజ్ పోటీల్లో కోదాడకు చెందిన తేజ పాఠశాల విద్యార్థి గుజ్జుల హర్షవర్ధనరెడ్డి విజేతగా నిలిచాడు. దేశవ్యాప్తంగా ఆగస్టు 10 నుంచి సెప్టెంబరు 30 వరకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ, కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జాతీయ అంతరిక్ష దినోత్సవ క్విజ్-2024 పేరున పోటీ నిర్వహించింది. ఈ పోటీలో 3,66,308 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో 100 మందిని ఎంపిక చేసి వారికి భారత అంతరిక్ష పరిశోధన సంస్థకు చెందిన అంతరిక్ష రాకెట్ ప్రయోగ కేంద్రం శ్రీహరికోటను సందర్శించే అవకాశం కల్పించారు. ఈ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 200 మంది విద్యార్థులు పాల్గొనగా, వీరిలో కోడాదకు చెందిన 7వ తరగతి విద్యార్థి గుజ్జుల హర్షవర్ధనరెడ్డి 100మందిలో నిలిచినట్లు కొమరబండ తేజ విద్యాలయ ప్రిన్సిపాల్ రమా సోమిరెడ్డి తెలిపారు. ఈ నెల 23వ తేదీన శ్రీహరికోటను సందర్శించే బృందంలో స్థానం సాధించారన్నారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో హర్షవర్ధనరెడ్డిని అభినందించారు. హర్షవర్ధనరెడ్డితో పాటు వెళ్లే వారికి ఉచిత రవాణా, వసతి, భోజన సౌకర్యం ఇస్రో కల్పిస్తుందన్నారు.

# జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీసీ ఏ సామాజిక వర్గానికే కేటాయించాలి

**- ప్రజా సంఘాల జిల్లా నాయకులు ఎదునూరి మదార్**




కరపత్రం (పాలకుర్తి ప్రతినిధి):
జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రిజర్వేషన్ ప్రకారం బీసీ.ఏ సామాజిక తరగతులకు కేటాయించి వారిని విస్మరించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకమండలి చైర్మన్ ను నియమించే ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని ప్రజా సంఘాల జిల్లా నాయకులు ఎదునూరి మదార్ అన్నారు.ఈ సందర్భంగా పాలకుర్తి నియోజక వర్గ కేంద్రంలో మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలకమండలి నియమాకం సంబంధించిన రిజర్వేషన్లను ప్రభుత్వం జీవో విడుదల చేసిందని, ఇందులో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బిసి ఏ సామాజిక తరగతులకు కేటాయించా రన్నారు. కాగా నిబంధనలకు విరుద్ధంగా రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ హక్కులను ఉల్లంఘించి బీసీ డీ చెందిన వ్యక్తి శివరాజు యాదవ్ ను ఏ విధంగా చైర్మన్ గా నియమిస్తారని అని ఉన్నతాధికారులను ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ సంబంధిత వ్యవసాయ శాఖ జిల్లా అధికారి రొటేషన్ పద్ధతిలో బీసీ సామాజిక తరగతికి చెందిన వ్యక్తి చైర్మన్ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు.. ప్రభుత్వం కేటాయించిన రిజర్వేషన్ ను అధికార కాంగ్రెస్ పార్టీ వాళ్లు తప్పుడు పద్ధతిలో, తుంగలో దొక్కడం చూస్తే బిసి ఏ సామాజిక తరగతులను అవమానపరిచే విధంగా ఉందన్నారు. ఇప్పటికైనా పునరా ఆలోచన చేసి శివరాజ్ యాదవ్ నియామకాన్ని రద్దు పరచి బిసి ఏ సామాజిక తరగతులకు చెందిన వారిని చైర్మన్ గా నియమించాలని డిమాండ్ చేశారు.
అలాగే ఈ విషయమై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంత కుమారి కి, మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జిల్లా ఇంచార్జ్ మినిస్టర్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లకు పిర్యాదు చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మేదరి (మహేంద్ర) సంఘం మండల అధ్యక్షులు రేపాల అశోక్, నాయీ బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షులు గొల్లపెల్లి సోమశేఖర్, ప్రధాన కార్యదర్శి జంపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మతోన్మాద బిజెపి దేశానికి ప్రమాదం

**-సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి**



కరపత్రం (పాలకుర్తి ప్రతినిధి):
బిజెపి మతోన్మాదుల పార్టీ అని దీనివలన దేశానికి అత్యంత ప్రమాదకరమని సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి విమర్శించారు.ఆదివారం పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో సిపిఎం పాలకుర్తి మండల మహాసభ తెలంగాణ రైతంగ సాయిధ పోరాట యోధురాలు ఐలమ్మ స్మారక భవనంలో సోమసత్యం అధ్యక్షత జరిగింది.
మహాసభల సూచికగా ఐలమ్మ భవన్ నుండి గుడివాడ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి అనంతరం అమరవీరుల స్థూపం దగ్గర సిపిఎం జెండాను మోకు కనకా రెడ్డి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకుర్తి ప్రాంతానికి వీరోచిత పోరాట చరిత్ర ఉందన్నారు. అమెరికా ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల మధ్య యుద్ధాలను సృష్టిస్తుండగా కమ్యూనిస్టు చైనా ప్రభుత్వం మాత్రం శాంతి స్థాపనకు కృషి చేస్తుందన్నారు. ఇజ్రాయిల్ ఇరాన్ మధ్య ఉగ్రేన్- రష్యా మధ్య యుద్ధాలను అమెరికానే ప్రోత్సహిస్తుందని విమర్శించారు. లౌకిక రాజ్యాంగ ఉన్న మన దేశానికి బిజెపి ప్రభుత్వం మతతత్వ విధానాలతో పాలిస్తుందని అన్నారు. దీనివలన భారత పౌరులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. యూపీఏ ప్రభుత్వానికి కమ్యూనిస్టులు మద్దతు పలికారని ఆ సమయంలో దేశ పేద ప్రజలకు ఉపయోగపడే అనేక చట్టాలు వచ్చాయన్నారు. అందులో ఉపాధి హామీ పథకం చట్టం, అటవీ హక్కుల చట్టం, సమాచార హక్కు చట్టం, కార్మిక చట్టాలు వచ్చాయన్నారు. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో హైడ్రా పేరుతో పేద ప్రజల ఇళ్లను కూల్చుతుందని ఈ చర్యలను సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటలతో కాలం ఎల్ల దీస్తుందనివిమర్శించారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, కొత్త పెన్షన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, సింగారపు రమేష్, జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల సోమన్న, మునిగల రమేష్, కొడపాక యాకయ్య, మండల కార్యదర్శి మాచర్ల సారయ్య, సోమసత్యం, మాసంపల్లి నాగయ్య, బెల్లి సంపత్, ముస్కు ఇంద్రారెడ్డి, చిట్యాల సంధ్యారాణి, కే. మల్లేష్, జంపయ్య, కొమురయ్య, శాంతమ్మ, కొమురయ్య, పద్మ, వెంకటమ్మ, ప్రవీణ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.




# 'జిగ్రా' ఎఫెక్ట్.. అకౌంట్ డిలీట్ చేసిన దర్శకుడు

అలియాభట్ వేదాంగ్ రైనా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జిగ్రా' బాలీవుడ్ దర్శకుడు వాసన్ బాలా తెరకెక్కించారు. ఎన్నో అంచనాల మధ్య ఇటీవల విడుదలైన ఈ యాక్షన్ థ్రిల్లర్ బాక్సాఫీస్ వద్ద అనుకున్న ఫలితాన్ని అందుకోలేకపోయింది. మరోవైపు, సోషల్‌మీడియా వేదికగా పలువురు నెటిజన్లు ఈ చిత్రంపై నెగటివ్ కామెంట్స్ చేశారు. ఈ నేపథ్యంలో తన ఎక్స్ (ట్విటర్) ఖాతాను వాసన్ డీయాక్టివేట్ చేశారు.పస్తుతం ఆయన ఖాతా కోసం సెర్చ్ చేస్తుంటే.. ఈ పేరుతో ఖాతా లేదని సందేశం వస్తోంది. మరోవైపు, వాసన్ ఇన్‌స్టా వేదికగా యాక్టివ్‌గా ఉన్నారు. తమ సినిమాపై వస్తోన్న పాజిటివ్ రెస్పాన్స్‌లను ఇన్‌స్టా స్టోరీస్‌లో షేర్ చేస్తున్నారు. తమ చిత్రాన్ని ఆదరించిన వారికి ధన్యవాదాలు చెబుతున్నారు.తమ్ముడి కోసం అక్క చేసే పోరాటం నేపథ్యంలో 'జిగ్రా' తెరకెక్కింది. కరణ్ జోహార్ నిర్మాత. అక్టోబర్ 11న విడుదలైంది. ఇదే ఏడాదిలో విడుదలైన 'సవి' చిత్రాన్ని కాపీ కొట్టి దీనిని తెరకెక్కించారని పలువురు కామెంట్స్ చేశారు. 'జిగ్రా' విషయంలో ఫేక్ కలెక్షన్స్ ప్రకటిస్తున్నారంటూ 'సవి' నటి దివ్యా ఖోస్లా సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టడం బాలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. ఫేక్ బుకింగ్స్/కలెక్షన్స్ గురించి వాసన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "దీనికి డిస్ట్రిబ్యూటర్లు సమాధానం చెబుతారు. కలెక్షన్స్‌పై ఎవరైనా ఇన్వెస్టిగేట్ చేయొచ్చు. అందుకు స్వాగతిస్తాం" అని తనదైన శైలిలో సమాధానమిచ్చారు.

# గేమ్ ఛేంజర్ లో మరో టాలీవుడ్ హీరో..





మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ గేమ్ ఛేంజర్ చిత్రంలో హీరోగా నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ చిత్రానికి ప్రముఖ డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహిస్తుండగా ప్రముఖ సినీ నిర్మాత దిల్ రాజు నిర్మిస్తున్నారు. దాదాపుగా 300 కోట్ల రూపాయల బడ్జెట్ తో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. గేమ్ ఛేంజర్ చిత్రం సంక్రాంతి కానుకగా వచ్చే ఏడాది జనవరి 10న ప్రేక్షకుల ముదనుకు రాబోతోంది.అయితే ఈ చిత్రంలో టాలీవుడ్ ప్రముఖ హీరో నవీన్ చంద్ర కూడా ప్రాధాన్యత ఉన్నటువంటి పాత్రలో నటిస్తున్నాడు. ఈ విషయం గురించి నవీన్ చంద్ర ఓ ఇంటర్వ్యూలో స్పందిస్తూ గేమ్ ఛేంజర్ సినిమాలో తన పాత్ర గురించి పలు ఆసక్తికర విషయాలు ప్రేక్షకులతో పంచుకున్నాడు.ఇందులో భాగంగా మొదటగా గేమ్ ఛేంజర్ చిత్రం కోసం ఈ చిత్రానికి కో డైరెక్టర్ గా పని చేస్తున్న భరత్ తనని సంప్రదించారని ఈ క్రమంలో శంకర్ సినిమా అని చెప్పడంతో తన పాత్ర గురించి వివరాలు తెలుసుకోకుండానే ఒప్పుకున్నానని తెలిపాడు. ఇక గేమ్ ఛేంజర్ లో తనది ఫుల్ లెంగ్త్ రోల్ ఉంటుందని అలాగే ఎక్కువ సన్నివేశాలు రామ్ చరణ్ తో ఉంటాయని చెపుకొచ్చాడు. ఇక డైరెక్టర్ శంకర్ సినిమా సెట్ లో ప్రతీదీ తానే దగ్గరుండి చూసుకుంటాడాని అలాగే యాక్ట్ చేసేముందు తానే యాక్ట్ చేసి చూపిస్తాడాని దీంతో నటీనటులకి మరింత ఈజీ అవ్వడంతోపాటూ మేకింగ్ లో క్వాలిటీ పెరుగుతుందని తెలిపాడు.

# టిట్ల తర్వాత పటేల్ పాత్రతో ఆ మ్యాజిక్



ప్రతినాయకుడిగా.. సహాయనటుడిగా విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు నటుడు అజయ్. ఇప్పుడాయన ముఖ్య పాత్రలో నటించిన చిత్రం 'పొట్టేల్'. యువ చంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాని సాహిత్ మోత్కూరి తెరకెక్కించారు. ఇది ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు అజయ్."ఇది భిన్న కోణాలున్న కథ. పూర్తిగా 1980ల నాటి తెలంగాణ నేపథ్యంలో సాగుతుంది. ఓ చిన్న పాప చదువు కోసం చేసే పోరాటం ప్రధాన ఇతివృత్తంగా ఉంటుంది. అలాగే మూఢనమ్మకాలు.. వాటిని అడ్డుపెట్టుకుని బతికే మనుషులు.. మొండితనం.. గ్రామదేవతలు.. ఇలా చాలా కోణాల్ని ఈ కథలో స్పృశించారు దర్శకుడు సాహిత్. నిజానికి ఇలాంటి కథలు చెప్పేటప్పుడు కొన్నిసార్లు సందేశం ఎక్కువైపోయే ప్రమాదముంది. కమర్షియల్‌గా తీసుకురావడం చాలా కష్టం. కానీ, సాహిత్ దీన్ని అన్ని రకాల వాణిజ్య హంగులతో మంచి సినిమాటిక్ అనుభూతిని అందించేలా గొప్పగా తీర్చిదిద్దాడు. ఇందులో విజిల్స్ పడే మాస్ సీన్స్ చాలా ఉన్నాయి"."ఏ నటుడికైనా ప్రతి సినిమా ఓ కొత్త ఆవిష్కరణలాగే ఉంటుంది. అనుభవం సాధించే కొద్దీ నటుడిగా లోలోపల ఉన్న భయాలు తగ్గి దేన్నైనా తేలికగా అర్థం చేసుకుని చేయగలిగే నేర్పు వస్తుంది. ఈ చిత్ర విషయంలో నాకు సవాల్‌గా అనిపించింది ఈ కథలోని సంస్కృతిని సహజంగా తెరపైకి తీసుకురావడమే. దీంట్లో నేను పటేల్‌గా ప్రతినాయక ఛాయలున్న పాత్రలో కనిపిస్తా. కొన్ని సీన్స్‌లో చీరకట్టులో కనిపిస్తా. తెలంగాణలో సిగం (దేవుడు పూనడం) అని ఉంటుంది. అది వచ్చినప్పుడు ఆ వ్యక్తులు మాట్లాడే విధానం చాలా భిన్నంగా ఉంటుంది. ఈ పాత్ర చేసేటప్పుడు దాని మీద కొంత హోంవర్క్ చేశా. నేను చేసిన సినిమాల్లో 'విక్రమార్కుడు'లోని టిట్ల పాత్ర నాకెంతో పేరు తెచ్చి పెట్టింది. ఆ తర్వాత అలాంటి పాత్రలు కొన్ని ప్రయత్నించినా ఆ మ్యాజిక్ మళ్లీ కుదర్లేదు. కానీ, ఈ సినిమా ఆ లోటు తీరుస్తుందనిపిస్తోంది. టిట్ల తర్వాత నాకు చాలా నచ్చినది ఇందులోని పటేల్ పాత్రే. నటుడిగా నాకెంతో ఆనందాన్నిచ్చిన పాత్రిది. నాదే కాదు.. ఇందులోని యువ, అనన్య తదితరుల పాత్రలన్నీ కూడా చాలా బాగా కుదిరాయి"."ఈ చిత్రసీమలో 25 ఏళ్లుగా నటుడిగా ఉండగలగడం మామూలు విషయం కాదు. ఇన్నేళ్లు ఇక్కడ నిలకడగా కొనసాగడమే నా వరకు పెద్ద గిఫ్ట్. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా 250 సినిమాలు చేసే పరిస్థితి ఇప్పుడు లేదు. సినిమాల సంఖ్య తగ్గిపోతోంది. ఈ ఏడాది నాకు 'దేవర', 'మత్తువదలరా 2' లాంటి రెండు పెద్ద విజయాలు దక్కాయి. నా పాత్రల్లో కొన్ని మీమ్స్ వైరల్ అయ్యాయి. అవి చూస్తున్నప్పుడు చాలా ఆనందంగా ఉంది. నాకు బలమైన భావోద్వేగాలు నిండిన పాత్రలు చేయాలని ఉంది. ఇటీవలే నేను 'సింగం అగైన్' చేశాను. 'పుష్ప 2', 'గరుడన్' తెలుగు రీమేక్ తదితర చిత్రాలు చేస్తున్నా".



# నటుడు కిచ్చా సుదీప్‌కు మాతృవియోగం

కన్నడ నటుడు కిచ్చా సుదీప్ ఇంట తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఆయన తల్లి సరోజా సంజీవ్ (86) ఆదివారం కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో కొన్ని రోజులుగా బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె ఈరోజు ఉదయం తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న పలువురు ప్రముఖులు సుదీప్‌ను పరామర్శించారు. ఆమె మృతి పట్ల సంతాపం ప్రకటించారు. మరోవైపు అభిమానులు సైతం సంతాపం తెలియజేస్తున్నారు."ప్రముఖ నటుడు కిచ్చా సుదీప్ మాతృమూర్తి కన్నుమూశారని తెలిసి చింతించాను. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. తన నట జీవితంపై తల్లి ప్రభావం, ప్రోత్సాహం ఉందని సుదీప్ ఎన్నోసార్లు తెలిపారు. మాతృ వియోగం నుంచి ఆయన త్వరగా కోలుకోవాలి. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పోస్ట్ పెట్టారు.

# తెలుగులో వరుస ఆఫర్లు దక్కించుకుంటున్న కన్నడ హీరో..



కన్నడ ప్రముఖ హీరో రిషభ్ శెట్టి ప్రస్తుతం టాలీవుడ్ సినిమా ఇండస్ట్రీపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నాడు. కాగా రిషభ్ శెట్టి గతంలో హీరోగా నటించిన కాంతార చిత్రం తెలుగులో కూడా రిలీజ్ కోట్ల రూపాయలు వసూళ్లు సాధించింది. దీనికితోడు రిషభ్ శెట్టికి టాలీవుడ్ లోని పలువురు స్టార్ హీరోలతో మంచి సన్నిహిత సంబంధాలు ఉండటంతో మంచి సపోర్ట్ ఇస్తున్నారు.ఇటీవలే రిషభ్ శెట్టి ప్రశాంత్ వర్మ డైరెక్ట్ చేస్తున్న జై హనుమాన్ చిత్రంలో హనుమంతుడి పాత్రలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఈ చిత్రం ప్యాన్ ఇండియా భాషలలో తెరకెక్కుతోంది. దీంతో రిషభ్ శెట్టి కెరీర్ కి మంచి ప్లస్ కానుంది. అయితే రిషభ్ శెట్టి మరో తెలుగు సినిమాలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు.ఈ చిత్రాన్ని ప్రముఖ సినీ నిర్మాణ సంస్థ సితార ఎంటర్టైన్మెంట్స్ నిర్మిస్తోంది. అయితే చిత్రంలో హీరో హీరోయిన్లు ఎవరనే వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. కాంతర చిత్రం పెద్ద హిట్ అవ్వవడంతో రిషభ్ శెట్టి రెమ్యూనరేషన్ పెంచేసినట్లు సమాచారం.ఈ విషయం ఇలా ఉండగా ప్రస్తుతం రిషభ్ శెట్టి కన్నడ లో కాంతార 2 చిత్రంలో హీరోగా నటిస్తున్నాడు. ఇప్పటికే ఈ చిత్రం షూటింగ్ పనులు పూర్తయ్యాయి. దీంతో ఈ చిత్రాన్ని సమ్మర్ కానుకగా రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తున్నారు